క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారెడ్డి

దొర్నిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చాకరాజువేముల, బుర్రారెడ్డిపల్లె గ్రామంల్లో సర్పంచులు పద్మిని, రాజ్యలక్ష్మిల ఆధ్వర్యంలో సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పీఎం కిసాన్, ప్రధానమంత్రి సురక్షయోజన, పీఎం ఆవాజ్ యోజన, ఉజ్వల, ఆయుస్మాన్ భారత్ వంటి సంక్షేమ పథకాలను టీవీ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, ఏఓ సునీత, నాయకులు శ్రీపతి ప్రసాద్, శ్రీరాములు, ఉప సర్పంచి బాల సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆయాలపై శాఖా పరంగా చర్యలు తీసుకుంటాం



మందలూరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి

రుద్రవరం: ప్రజలకు,గ్రామ సర్పంచుకు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఆయాల తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి గాయిత్రి తెలిపారు. మండల పరిధిలోని మందలూరులో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగాం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తుండగా సర్పంచ్ నిర్మలాదేవి, నాయకుడు శ్రీనివాసరెడ్డి డాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండానే 104 వైద్యశిబిరం నిర్వహిస్తారా అని నిలదీశారు. స్పందించిన డాక్టర్ ఆయాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు వాయిదా

రుద్రవరం: మండలంలో శుక్రవారం నుంచి నిర్వహించాల్సిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు 26వ తేదీకి వాయిదా పడిందని ఎంపీడీఓ మధుసూధనరె డ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన, ఎంఈఓ కోటయ్యతో కలిసి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల ఆడుదాం ఆంధ్ర వాయిదా పడిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేపట్టినందున చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మహిళా పోలీసులకు బాధ్యతలు అప్పగించామని, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు.

జాతీయ స్థాయి బాలోత్సవ్‌లో బహుమతులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): జాతీయ స్థాయి బాలోత్సవ్ 2023 పోటీల్లో గురురాజ విద్యార్థులు 41 బహుమతులు సాధించినట్లు గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్లు షేక్షావలి రెడ్డి, మౌలాలిరెడ్డి గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలోని నంబూరులో నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీల్లో గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు 60 విభాగాల్లో బహుమతులు సాధించారన్నారు. 605 పాఠశాలల నుంచి 16వేల మంది విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారన్నారు. రాయలసీమలో అత్యధిక బహుమతులు సాధించి వీవీఐటీ బాలోత్సవ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, విద్యాసాగర్, ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా సంఘం అధ్యక్షులు విజయ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు తీసుకున్నారన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరిరెడ్డి అభినందించారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): కరువు మండలాల్లో రైతుల నష్టాలను గుర్తించి జాతీయ విపత్తుగా పరిగణించి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, రైతు సంఘం కో కన్వీనర్ సోమన్న, ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని డోన్, ప్యాపిలి, కొలిమిగుండ్ల, సంజామల, నందికొట్కూరు, జూపాడుబంగ్లాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ధనుంజయుడు, శ్రీనివాసులు, పాములేటి, సుబ్బరాయుడు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

- ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశాం
- ప్రతిపక్షాలు, పచ్చ మీడియా ఏమిచెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

సమస్యలు పరిష్కరిస్తున్నందుకే ధైర్యంగా మీ ముందుకు



వృద్ధురాలి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నందుకే ధైర్యంగా గడప గడపకు వెళ్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం బత్తలూరు సచివాలయ పరిధిలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రా రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి రాత్రి 10 గంటల వరకు గ్రామంలో పర్యటించారు. గడగపను సందర్శించి ప్రజా సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి రావలసిన సంక్షేమ పథకాలు వచ్చాయా ?, ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వింటూ పరిష్కారమయ్యే వాటిపై అధికారులతో చర్చించి అక్కడిక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మరికొన్ని సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలపై ప్రజలు 100 శాతం సంతృప్తి వ్యక్తం చేశారు.

చంద్రబాబు హయాంలో రూ.3 లక్షల కోట్ల అప్పు

చంద్రబాబు అధికారంలో ఉన్న 2014 – 19 మధ్యలో రూ 3 లక్షల కోట్లు అప్పులు మిగిల్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎమ్మెల్యే అన్నారు. గతంతో పోల్చుకుంటే జగనన్న పాలనలో ఆ పరస్థితి లేదన్నారు. ప్రతిపక్షాలు పచ్చ మీడియాను అడ్డు పెట్టుకుని వాస్తవాలను రాయకుండా అవాస్తవాలను రాస్తున్నారన్నారు. ఎన్ని అబద్ధాలు సృష్టించినా ప్రజలు టీడీపీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెంచమ్మ, ఎంపీటీసీ సాల్‌మెన్, నాయకులు సుబ్బయ్య, ప్రతాపరెడ్డి, పుల్లారెడ్డి, రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి ఉన్నారు.

ఆరోగ్యకర జీవనశైలికి 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడంతో పాటు ఆరోగ్యకమైన జీవన శైలిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బత్తలూరు గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా వస్తువులను సచివాలయాల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 15వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, 15 ఏళ్లు నిండిన పురుషులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ ఖాన్, నాయకులు యాదవాడ నరసింహారెడ్డి, డాబా మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి క్రీడా పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ అధ్యక్షురాలిగా నాగసుప్రజ



నాగసుప్రజను సత్కరిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ అధ్యక్షురాలిగా బనగానపల్లెకు చెందిన నాగసుప్రజను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. తనను జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికున్నందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లాలోని పేద ఆర్యవైశ్య కుటుంబాలకు తనవంతుగా సహకారం అందిస్తానన్నారు. అనంతరం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు బింగుమల్ల శ్యాంసుందర్ గుప్త, అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, నాగరాజు, సతీష్‌కుమార్, ధనుంజయ, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల సెక్టోరియల్ ఆఫీసర్ రాజేంద్రకుమార్

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు ఎంపీయూపీ పాఠశాలలోని 4, 5 పోలింగ్ కేంద్రాలను ఎస్‌ఐ తిరుపాల్‌తో కలిసి ఎన్నికల సెక్టోరియల్ ఆఫీసర్ రాజేంద్రకుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్, ర్యాంప్ తదితర వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే గత ఎన్నికల్లో అవాంఛనీయ ఘటలను ఎమైనా జరిగాయా అని స్థానికులతో ఆరా తీశారు. వీరి వెంట బీఎల్‌ఓ ఉసేనమ్మ తదితరలు ఉన్నారు.

రుద్రవరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం సెక్టోరియల్ అధికారులు పరిశీలించారు. ఐదు సెక్టార్ల అధికారులు పీఆర్ ఏఈ వెంకట రాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్, ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ, ఏఓ శ్రీకృష్ణ, ఆళ్లగడ్డ కేసీ కాల్వ ఏఈ మౌనికాబాయి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. అదేవిధంగా తహసీల్దార్ రవీంద్ర ప్రసాదు మండల కేంద్రం రుద్రవరంతోపాటు పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలంటెంపుల్ : లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరీ బీజేపీ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతానికి పాటుపడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు, నాయకులు కొట్టె కృష్ణమూర్తి, మురళీధర్, ఇంటి ఆదినారాయణ, శివారెడ్డి, సుధాకర్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపుగా వాడాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): విద్యుత్‌ను పొదుపుగా వినియోగించి భావితరాలకు నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ ఈఈ రమణారెడ్డి అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా గురువారం నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఈఈ మాట్లాడుతూ విద్యుత్‌ను అధికంగా వినియోగిస్తే వాతావణ కాలుష్యం అధికమవుతుందన్నారు. పగటి పూట వీలైనంత వరకూ కిటికీలు తెరచి లైట్లు, ఫ్యాన్ల వాడాకాన్ని తగ్గించాలన్నారు. శుక్రవారం పట్టణంలో జరిగే ర్యాలీలో సంబంధిత ఉద్యోగులు, సిబ్బందితో పాటు వినియోగదారులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీఈ ఆంథోనిరాజు, ఏఈలు రామయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు



సంక్షేమాభివృద్ధికి సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): అర్హతే ప్రామాణికంగా లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. గురువారం స్థానిక 41వ వార్డు నీలి వీధిలో వార్డుకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలోని గత నాలుగున్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. 41వ వార్డులో రూ.19.39 కోట్లతో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ కన్వీనర్ నాగరత్నమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతునిద్దాం

ఉయ్యాలవాడ : అర్హుందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అందరం మద్దతునిద్దామని గ్రామ సచివాలయ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం ఉయ్యాలవాడలో పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ ప్రజలకు వర్తించిన లబ్ధి, గ్రామంలో జరిగిన అభివృద్ధిని ఆయన వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలోగ్రామ వలంటరీ సుభహాన్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఉయ్యాలవాడ : ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం ఏపీఓ రవిప్రకాష్‌కు రవిప్రకాష్‌కు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. మాన్‌డేస్ విధానం రద్దు చేసి కనీస వేతనం రూ. 25 వేలు అమలు చేయాలని, పదోన్నతులు, బీమా సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లు ఆకుల రవి, ఓబులేస్, ప్రసాద్‌రెడ్డి, నారాయణ, నాగేంద్ర, ప్రసాద్ కోరారు.

3జీ అవార్డు విచారణకు 325 మంది హాజరు



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గోస్పాడు: 167కే నేషనల్ హైవే కోసం భూ సేకరణకు సంబంధించిన 325 మంది రైతులు గురువారం నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన 3జీ అవార్డు విచారణకు హాజరయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 3జీ అవార్డు విచారణ స్థానిక తహసీల్దార్ విజయ శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని ఐదు గ్రామాల పరిధిలో నంద్యాల–జమ్మలమడుగుకు నేషనల్ హైవే రహదారి 167కే ఏర్పాటుకు భూముల సేకరణ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఎం.చింతకుంట్ల 10.903 ఎకరాలు, జూలేపల్లె 12.119 ఎకరాలు, పసురపాడు 20.929 ఎకరాలు, గోస్పాడు 32.454 ఎకరాలు, ఒంటివెలగల 16.959 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు చెప్పారు. ఇందులోని ఐదు గ్రామాల పరిధిలో 612మంది రైతులకు సంబంధించిన 93.164 ఎకరాల భూమి ఉందని వివరించారు. అందులో 325 మంది రైతులు తమకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల రైతులు తమకు సంబంధించిన పూర్తిస్థాయి డాక్యుమెంట్లు సమర్పించగా వాటిని పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం భూమికి సంబంధించిన ధరలపై రైతులతో ఆర్‌డీఓ మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు, సీనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం నంద్యాలలో 36 గంటల ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏసురత్నం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రమణకుమారి, నాగమణి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి, పనిభారాన్ని తగ్గించాలన్నారు. ప్రభుత్వ సెలవులు, రిటైర్‌మెంట్ గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మమ్మ, షమీమ్, శివమ్మ, సుమలత, కృపావతి, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి..

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరసన కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. న్యాయమైన అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మలమ్మ, లక్ష్మణ్, తోటమద్దులు, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్‌వాడీల నిరసన

గోస్పాడు: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ సంఘం నాయకురాళ్లు నిర్మలమ్మ, రమణమ్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన గోస్పాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మూడవ రోజు గురువారం రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆదిలక్ష్మి, భూలక్ష్మి, సువర్ణ, హుసేనమ్మ, ప్రభావతి, సారమ్మ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మిడుతూరు: మండలపరిధిలోని కలమందలపాడు గ్రామంలో గురువారం ఓ వ్యక్తి ఉరేసుకొని మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల మహమ్మద్ రఫి (42) కొంత పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పంటల సాగుకోసం అప్పు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా సరైన దిగుబడులు రాక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నూర్జహాన్‌బీ అంగన్‌వర్కర్‌గా పని చేస్తోంది. ఆమె విధులకు వెళ్లగా.. తల్లి మౌలాబీ ఇంటికి సమీపంలో కిరాణం కొట్టు నిర్వహిస్తోంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతిచెందిన కుమారుడిని చూసి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉండగా.. ఇటీవల పెద్ద కుమార్తె వివాహం ఖరారైంది. ఇటువంటి తరుణంలో కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న హెచ్‌ఎం ఫయాజుర్ రహీం

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వివాహాలతో హింస జరిగే అవకాశం ఉందని మున్సిపల్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఫయాజుర్ రహీం అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో గురువారం బాల్య వివాహాలపై విద్యార్థులకు న్యూ బిగినింగ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం బాలికలకు వివాహాలు చేసిన వారికి జరిమానాలు, జైలు శిక్షలు విధించబడుతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్టు రిసోర్స్ మేనేజర్ ఓబులేసు, మహిళా పోలీసు మాధవి, ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

19 నుంచి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీలు

మహానంది: మహానంది సమీపంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు రాష్ట్రస్థాయి అంతర వ్యవసాయ కళాశాలల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కేఎస్‌ఎస్ నాయక్ తెలిపారు. వ్యవసాయ కళాశాలలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 18 వ్యవసా య కళాశాలల నుంచి 526 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. మూడో విడత పోటీల్లో భాగంగా క్రికెట్, పుట్‌బాల్‌తో పాటు అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ ఎంఎస్ రాహుల్, డాక్టర్ శ్రీనివాసురెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్లు



అమ్మవారి ఆశీర్వచన మండపంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను గురువారం ఇన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్ కె. వెంకట నరసింహాచారి, ప్రిన్సిపల్ కమిషనర్ డాక్టర్ మల్లికార్జున, కమిషనర్ కె.రవికిరణ్‌లు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలను అందజేశారు.

నేడు భూ సేకరణ బాధితులతో సమావేశం

దొర్నిపాడు: నంద్యాల–జమ్మలమడుగు ఎన్‌హెచ్167కే భూ సేకరణలో భాగంగా గుండుపాపల గ్రామానికి చెందిన భూమి, ఇళ్లు కోల్పోయిన బాధితులతో శుక్రవారం స్థానిక సహకార సంఘం ఆవరణలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయప్రసాద్ తెలిపారు. ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డు, పొలం పట్టాదారు పుస్తకం, ఈసీ, ఆన్‌లైన్ ఆర్‌ఓఆర్, అడంగల్, రెండు పాస్ పోర్ట్‌సైజ్ ఫోటోలతో సమావేశానికి రావాలని సూచించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు ప్రాధాన్యం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల ద్వారా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేయబడిన రోగులకు అధిక ప్రాధాన్యతనిచ్చి వైద్యం చేయనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి చెప్పారు. ఈనెల 13న విజయవాడలో నిర్వహించిన ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ల సమావేశంలో చర్చించిన అంశాలను ఆయన గురువారం వెల్లడించారు. ఆసుపత్రిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల నుంచి రెఫర్ చేయబడిన రోగుల కోసం ప్రత్యేకంగా ఓపీ ఏర్పాటు చేశామని, అవసరమైతే వారిని ఆరోగ్యశ్రీ ద్వారా చేర్చుకుని చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. వారికి రవాణా ఛార్జీలు సైతం చెల్లిస్తున్నామన్నారు. ఈ విషయమై రాష్ట్ర సమావేశంలో ప్రత్యేక సలహాలు అందజేశారన్నారు.

ఈవీఎంలపై అవగాహన

పాణ్యం: మండల కేంద్రంలోని అయ్యపురెడ్డి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఓ మహబూబ్‌బాషా, జూనియర్ అ సిస్టెంట్ పార్వతి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది ఈవీఎంల పని తీరు, ఓటు ఎలా వినియోగించుకోవాలి, కీ ప్యాడ్‌పై ఉండే పార్టీల గుర్తు తదితర అంశాలపై ఓటర్లకు వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీటీడబ్ల్యూఓ

మహానంది: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాలు అందించాలని నంద్యాల జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకట శివప్రసాద్ సూచించారు. మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులు పరిశీలించిన హాస్టల్ వార్డెన్ అంబమ్మకు పలు సూచనలు చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి



డ్రోన్ కెమెరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మిడుతూరు: ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని తిమ్మాపురం, సుంకేసుల సర్పంచ్‌లు నాగస్వామిరెడి, ఇందిరమ్మ అన్నారు. గురువారం మండలపరిధిలోని తిమ్మాపురం, సుంకేసుల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంటల సాగులో రసాయన మందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక టెక్నాలజీతో తక్కువ పెట్టుబడులు పెట్టి అధిక దిగుబడులు సాధించాలని చెప్పారు. అనంతరం సర్పంచ్‌ల ఆధ్వర్యంలో డ్రోన్ కెమెరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆయా శాఖల అధికారులు కేంద్ర పథకాలపై (ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, ప్రధాన మంత్రి సురక్ష యోజన, జలజీవన్ మిషన్, పీఎం కిసాన్ కార్డులు) అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బయ్య, ఏపీఓ జయంతి, పంచాయతీ కార్యదర్శులు ఫరీద్ బాషా పాల్గొన్నారు.

సామాజిక మాధ్యమాలతో అనర్థాలు



మహానందిలో పూజలు నిర్వహిస్తున్న మనాశ్రీ దంపతులు

మహానంది: సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో కొంత ప్రయోజనం ఉన్నప్పటికీ అనర్థాలు అధికంగా ఉన్నాయని సినీ గేయ రచయిత, కవిశేఖర మనాశ్రీ తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం కుటుంబసభ్యులతో కలిసి గురువారం మహానంది వచ్చారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల ద్వారా కొందరు యువతీ యువకులు పెడదోవ పడుతున్నారన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సులో స్మార్ట్ ఫోన్లు ఇవ్వడం భావ్యం కాదన్నారు.